9th HAPPY ANNIVERSARY

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 సంచిక : 345 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 29 ఆగస్టు 2024 వెల : 5/-రూ॥

VOLUME :10 ISSUE : 345 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 29 AUGUST 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


### ఏపీ మంత్రివర్గ సమావేశం..

## కీలక నిర్ణయాలివే

- రివర్స్ టెండరింగ్ పాలసీకి స్వస్తి
- స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) రద్దు
- పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో తొలగింపు
- సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్




**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో ఏపీ క్యాబినెట్ భేటీ కొనసాగుతోంది. ఈ సమావేశంలో మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గత జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన రివర్స్ టెండరింగ్ పాలసీకి స్వస్తి పలికింది.పాత పద్ధతిలోనే టెండరింగ్ కొనసాగేలా క్యాబినెట్ ఆమోదించింది. అలాగే స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ను రద్దు చేసింది. పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో తొలగింపుతో పాటు సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివాదాల్లోని భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేతకు ఆమోదించింది. ఆబ్కారీ శాఖ పునర్ వ్యవస్థీకరణకు ఆమోదం తెలిపింది. అలాగే పోలవరం ఎడమ కాలువ పనుల పునరుద్ధరణకు క్యాబినెట్ ఆమోదించడంతో పాటు ప్రస్తుతం పనిచేస్తున్న గుత్తేదారు సంస్థనే కొనసాగించాలని నిర్ణయించింది.

### కేంద్రం చర్యలతో ఏపీ అభివృద్ధి చెందుతుందన్న

# నమ్మకం కలుగుతోంది

- పోలవరంను పూర్తిగా నిర్మిస్తామన్న కేంద్రం
- ఏపీకి రెండు ఇండస్ట్రియల్ హబ్ లు కేటాయింపు
- కేంద్రం నిర్ణయాల పట్ల హర్షం వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు
- ఏపీకి ఇవాళ చారిత్రాత్మక దినం అని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్మించేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడంతో పాటు ఏపీకి రెండు ఇండస్ట్రియల్ హబ్ లు ప్రకటించిన నేపథ్యంలో, సీఎం చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఇవాళ ఏపీకి చారిత్రాత్మక దినం అని, ఇదొక శుభారంభం అని చంద్రబాబు అభివర్ణించారు. నిరాశ, నిస్పృహల్లో ఉన్న రాష్ట్రానికి ఈ ప్రకటన మంచి ఊతమిస్తుందని, ఒక నమ్మకాన్ని, భరోసాని కల్పిస్తుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తిగా జాతీయ ప్రాజెక్టు అని వెల్లడించారు. ఫేజ్-1 కింద ప్రాజెక్టు వ్యయం రూ.30,436.95 కోట్లు అని వెల్లడించారు. ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించే నాటికి రూ.4,730 కోట్లు పెట్టుబడి పెట్టామని తెలిపారు. దాన్ని రాష్ట్ర వాటాగా పరిగణించి, మిగిలిన మొత్తాన్ని కేంద్రం భరించేట్టు ఒక అవగాహనకు వచ్చామని చంద్రబాబు వివరించారు.
బ్యాలన్స్ అమౌంట్ చూసినప్పుడు రూ.25,706 కోట్లు అని, అందులో ఇంతవరకు విడుదల చేసింది రూ.15,146 కోట్లు అని స్పష్టం చేశారు. భూసేకరణ, పునరావాసం వ్యయం పోగా... రూ.12,157 కోట్లు ఇవ్వడానికి కేంద్ర క్యాబినెట్ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని వివరించారు. 2024-25కి రూ.6 వేల కోట్లు... 2025-26కి రూ.6,157 కోట్లు ఇవ్వడానికి కేంద్రం అంగీకరించిందని తెలిపారు.
ఇక, తాజాగా ప్రకటించిన కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ లు, ఇంతకుముందు ప్రకటించిన మరో రెండు హబ్ లతో కలిపి ఏపీలో ఇండస్ట్రియల్ హబ్ ల సంఖ్య నాలుగుకు చేరిందని వివరించారు. ఇవన్నీ పూర్తి చేసుకుంటే ఏపీలో ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని, ఆర్థికాభివృద్ధి జరుగుతుందని అన్నారు. కేంద్రం చర్యలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న విశ్వాసం కలుగుతోందని చెప్పారు. రాష్ట్రంలో ఇలాంటి అవకాశాలు ఉంటే, వాటిని ఉపయోగించుకోకుండా రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ఇదంతా మా ఘనతే అని చెప్పుకునే దౌర్భాగ్య స్థితికి వచ్చారని గత ప్రభుత్వంపై చంద్రబాబు ధ్వజమెత్తారు.
వేరే దేశంలో అయితే ఇలాంటి వాళ్లను ఏం చేస్తారో తెలియదు కానీ, మన దేశంలో కాబట్టి ఇలా జరిగిపోతోంది అని వ్యాఖ్యానించారు.

### డీఎంకే ఎంపీకి రూ. 908 కోట్ల భారీ జరిమానా!




- అధికార డీఎంకే పార్టీకి చెందిన ఎంపీ ఎస్ జగత్రక్షకన్‌కు ఈడీ షాక్
- 'ఫెమా' నిబంధనల ఉల్లంఘన కేసులో ఈ భారీ జరిమానా విధించిన ఈడీ
- ప్రస్తుతం అరక్కోణం నుంచి లోక్‌సభ ఎంపీగా కొనసాగుతున్న జగత్రక్షకన్

**పెన్ పవర్ డెస్క్:**తమిళనాడులోని అధికార డీఎంకే పార్టీకి చెందిన ఎంపీ, ప్రముఖ వ్యాపారవేత్త ఎస్.జగత్రక్షకన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) భారీ షాక్ ఇచ్చింది. ఆయనతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు రూ. 908 కోట్ల జరిమానా విధించింది. విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల

వివరాలు 2లో..


### తెలంగాణ బాగుండాలని రాజన్నను వేడుకున్నా



**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణలో అత్యధికంగా భక్తులు వచ్చే టెంపుల్ వేములవాడేనని.. మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం వేములవాడ రాజన్న ఆలయాన్ని మంత్రి పొన్నం సందర్శించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్‌కు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రాజన్నకు మంత్రి పొన్నం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేను రాజన్న భక్తుడిని, దక్షిణ కాశి వేములవాడ అని అన్నారు. వేద పండితుల, శృంగేరి పీఠాధిపతుల అనుమతితో త్వరలోనే ఆలయ అభివృద్ధికి పునాదులు వేస్తామన్నారు.రాబోయే

వివరాలు 2లో..

### పోలవరం ప్రాజెక్టు పూర్తిగా నిర్మించేందుకు కేంద్రం సుముఖత



- జాతీయ ప్రాజెక్టుగా పోలవరం
- కొన్నాళ్లుగా కొనసాగుతూనే ఉన్న నిర్మాణ పనులు
- ఇటీవల పలు దఫాలుగా కేంద్రంతో చంద్రబాబు చర్చలు
- పోలవరం నిధులన్నీ ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం!

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలోని పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గత కొన్నేళ్లుగా కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పోలవరం పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు పలు దఫాలుగా కేంద్రంతో పోలవరంపై చర్చించారు. ప్రధాన మంత్రి, ఆర్థిక, జలశక్తి మంత్రులతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో, కేంద్రం నుంచి సానుకూల స్పందన వెలువడింది. జాతీయ ప్రాజెక్టు పోలవరంను పూర్తిగా నిర్మించేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. ప్రాజెక్టుకు అవసరమైన నిధులన్నీ ఇచ్చేందుకు కేంద్రం సంసిద్ధత వెలిబుచ్చింది. బకాయిలు సహా, నిధులన్నీ ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపినట్టు తెలుస్తోంది.

### కోల్‌కతా హత్యాచార ఘటన...

## తీవ్రంగా కలిచివేసింది

- యావత్ దేశాన్ని కదిలించిన కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన
- అదో భయానక ఘటన అన్న రాష్ట్రపతి
- మహిళలపై జరుగుతున్న దారుణాలకు ఇకనైనా అడ్డుకట్టవేయాలన్న ద్రౌపది



**పెన్ పవర్ డెస్క్:**కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన యావత్ దేశాన్ని కదిలించింది. దీంతో బాధితురాలికి మద్దతుగా దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. తాజాగా ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించారు. ఈ ఘటనపై ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచి వేసిందన్న రాష్ట్రపతి... అదో భయానక ఘటన అని పేర్కొన్నారు. అక్కాచెల్లెళ్లు, కుమార్తెలు ఇలాం టి దారుణాలకు గురికావడాన్ని ఏ నాగరిక సమా జం అనుమతించబోదన్నారు. మహిళలపై జరుగు తున్న అఘాయిత్యాలకు ఇకనైనా అడ్డుకట్టవే యాలని చెప్పారు. పీటీఐ న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కోల్‌కతా ఘటనపై స్పందిస్తూ రాష్ట్రపతి ఈ వ్యాఖ్యలు చేశారు.

### వైసీపీకి మరో ఎదురుదెబ్బ... పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి పోతుల సునీత రాజీనామా

- ఇటీవలి ఎన్నికల్లో వైసీపీకి చావుదెబ్బ
- ఎన్నికల తర్వాత వరుసగా ఎదురుదెబ్బలు
- పార్టీ నుంచి ఒక్కొక్కరుగా వైదొలగుతున్న కీలక నేతలు
- జగన్ కు రాజీనామా లేఖ పంపిన పోతుల సునీత



**పెన్ పవర్ డెస్క్:**ఇటీవలి ఎన్నికల్లో కేవలం 11 అసెంబ్లీ సీట్లు, 4 ఎంపీ సీట్లు గెలిచి ఘోర పరాభవం మూటగట్టుకున్న వైసీపీకి ఆ తర్వాత కూడా ఎదురుదెబ్బలు తప్పడంలేదు. పార్టీ నుంచి ఒక్కొక్కరే వైదొలగుతున్నారు. తాజాగా, ఎమ్మెల్సీ పోతుల సునీత కూడా అదే బాట పట్టారు. పోతుల సునీత నేడు వైసీపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆమె తన రాజీనామా లేఖను పార్టీ అధినేత జగన్ కు, శాసనమండలికి పంపించారు. కాగా, పోతుల సునీత ఏ పార్టీలో

వివరాలు 2లో..

### ఏపీ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది...

## అందుకు ఇదే నిదర్శనం



- కొప్పర్తి, ఓర్వకల్లులో ఇండస్ట్రియల్ హబ్ లు.. కేంద్రం ప్రకటన
- ఏపీకి పరిశ్రమలు వచ్చేందుకు కేంద్రం సాయం చేస్తోందన్న కేంద్రమంత్రి రామ్మోహన్

వివరాలు 2లో..

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రానికి వివిధ రకాల పరిశ్రమలు వచ్చేందుకు కేంద్రం సాయం చేస్తోందని తెలిపారు. ఇవాళ కేంద్రం ఏపీకి రెండు ఇండస్ట్రియల్ హబ్ లను

### కొప్పర్తి, ఓర్వకల్లులో భారీ పారిశ్రామిక హబ్ లు వస్తున్నాయి

- ఏపీపై కేంద్రం కరుణ
- కొప్పర్తి, ఓర్వకల్లులో భారీ వ్యయంతో ఇండస్ట్రియల్ హబ్ లు
- వేల కోట్ల పెట్టుబడులు వస్తాయన్న కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్
- దాదాపు లక్ష మందికి ఉపాధి



**పెన్ పవర్ డెస్క్:**కేంద్రంలో అధికారం లో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం ఏపీపై కరుణ చూపిస్తోంది. తాజాగా కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ... కడప జిల్లా కొప్పర్తి, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో భారీ పారిశ్రామిక హబ్ లు వస్తున్నాయని వెల్లడించారు. ఓర్వకల్లులో 2,621 ఎకరాల్లో పారిశ్రామిక హబ్ వస్తోందని తెలిపారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ ప్రాజెక్టు వ్యయం రూ.2,786 కోట్లు అని వివరించారు. ఈ పారిశ్రామిక హబ్ లో


వివరాలు 2లో..

## 10 రాష్ట్రాల్లో12 స్మార్ట్ సిటీలు..

## తెలుగు రాష్ట్రాలకు 3 ప్రాజెక్టులు

- రూ. 28,602 కోట్ల పెట్టుబడితో 10 రాష్ట్రాలను కవర్..
- 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీలకు కేబినెట్ ఆమోదం
- నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ ప్రోగ్రాం కింద స్మార్ట్ సిటీస్ ఏర్పాటు
- ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీస్ లో తెలంగాణకు 1, ఆంధ్రకు 2
- తెలంగాణలోని జహీరాబాద్ లో
- ఆంధ్రప్రదేశ్ లోని ఓర్వకల్లు, కొప్పర్తిలో ఏర్పాటు

వివరాలు 2లో..



# సంపాదకీయం

### కొవ్వు కాలేయంతో బాధపడుతున్నారా?..

## ఈ ఆహారంతో మంచి ఫలితాలు

నిత్యం ఉరుకులు పరుగుల జీవితంలో మన జీవన శైలిలో మార్పులు, అంతర్గత ఆరోగ్య సమస్యల కారణంగా చాలా మందిలో కొవ్వు కాలేయం సమస్యతో బాధపడుతుంటారు. అయితే తీసుకునే కొన్ని ఆహార పదార్థాలతో కొవ్వు కాలేయం సమస్యను కొంతవరకు తగ్గించుకోవచ్చుంటున్నారు ఆహార నిపుణులు. కొవ్వు కాలేయం తగ్గించేందుకు సాయపడే కొన్ని రకాల ఆహార పదార్థాల గురించి మనం తెలుసుకుందాం..

**ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్..**

ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్.. ఇవి ఎక్కువగా చేపల్లో ఎక్కువగా ఉంటాయి. ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ కాలేయ కొవ్వు, వాపును తగ్గించడంలో ఎంతో సాయపడతాయి. కాబట్టి కొవ్వు కాలేయం ఉన్నవారు క్రమతప్పకుండా వారి ఆహారంలో చేపలు తీసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి.

**గింజలు**

ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్లతో నిండిన గింజలు కాలేయ పనితీరును మెరుగు పరుస్తాయి. కాలేయం వాపును తగ్గించడంలో సహాయపడతాయి.

**అవకాడోలు..**

అవకాడోలు చెడు కొలెస్ట్రాల్ తగ్గించడం , కాలేయ కొవ్వును తగ్గించడం ద్వారా కాలేయ ఆరోగ్యానికి తోడ్పడతాయి. కాబట్టి అవకాడోలను రోజు వారీ ఆహారంలో చేర్చుకుంటే కాలేయం కొవ్వును తగ్గించుకోవచ్చు.

**గ్రీన్ టీ..**

గ్రీన్ టీలో కాటెచిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కాలేయ కొవ్వు, వాపును తగ్గించడంలో సహాయపడతాయి. గ్రీన్ టీని రోజుకు ఒకసారి తీసుకోవడం ద్వారా మంచి ఫలితాలుంటాయంటున్నారు నిపుణులు.

**అలివ్ ఆయిల్..**

అలివ్ ఆయిల్ వల్ల ఆరోగ్య ప్రయోజనాలు చాలా ఉన్నాయి. ఇందులో మోనో అన్ శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉండటం వల్ల ఇది కాలేయం ఎంజైమ్ స్థాయిలను మెరుగు పరుస్తుంది. దీంతో కాలేయం లో కొవ్వు స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది.

**వెల్లుల్లి..**

వెల్లుల్లి లో అల్లిసిన్ , సెలీనియం వంటి ఆర్గానోసల్ఫర్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కాలేయాన్ని శుభ్రపరుస్తాయి. కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గిస్తాయి..

పైన తెలిపిన ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా కాలేయం కొవ్వును తగ్గించుకోవడంతో ఆరోగ్యంగా ఉండొచ్చంటున్నారు ఆహార నిపుణులు.

## ఏపీ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది...

# అందుకు ఇదే నిదర్శనం

- మొదటి పేజీ తరువాయి

నేపథ్యంలో, రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ఓర్వకల్లు, కొప్పర్తికి ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు మంజూరయ్యాయని వెల్లడించారు. రాయలసీమ వంటి వెనుకబడిన ప్రాంతంలో ఉద్యోగాల కల్పన అనేది చాలా ముఖ్యమైన విషయం అని తెలిపారు. అందుకే రాష్ట్ర సహకారంతో కేంద్రం ఇక్కడ పారిశ్రామిక హబ్ ఏర్పాటుకు శ్రీకారం చుడుతోందని పేర్కొన్నారు. కొప్పర్తి... విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ లో భాగంగా వస్తుందని రామ్మోహన్ నాయుడు వివరించారు. ఓర్వకల్లు, కొప్పర్తిలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కొప్పర్తిలో పునరుత్పాదక శక్తి, ఇంజినీరింగ్, కెమికల్, మెటాలిక్, నాన్ మెటాలిక్, టెక్స్ టైల్స్, ఆటోమొబైల్ కంపెనీలు వస్తాయని అన్నారు. ఇక్కడ రూ,8,800 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశముందని తెలిపారు.

రాయలసీమ అటు బెంగళూరుకు, ఇటు చెన్నైకి దగ్గరగా ఉంటుందని, హైదరాబాద్ కు సమీపంగా ఉంటుందని వివరించారు. గతంలో అక్కడ పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని రామ్మోహన్ నాయుడు అభిప్రాయపడ్డారు.

కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు ప్రాంతాలను ఎంపిక చేసుకున్నాయని, దీనిపై కేబినెట్ లో కూడా ఆమోదం లభించిందని వెల్లడించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఉంటే ఎలాంటి అభివృద్ధి జరుగుతుంది అనేదానికి ఇదొక నిదర్శమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజలు మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల నాయకత్వాన్ని బలపరిచి, ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించారని తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిన నేపథ్యంలో, రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో పయనించాలంటే ఈ ముగ్గురి నాయకత్వం అవసరమని ప్రజలు భావించారని, కూటమి గెలుపునకు ఇదే కారణమని వివరించారు.

## డీఎంకే ఎంపీకి రూ. 908 కోట్ల భారీ జరిమానా!

- మొదటి పేజీ తరువాయి

ఉల్లంఘన కేసులో ఈ భారీ జరిమానా విధించినట్లు ఈడీ స్పష్టం చేసింది. ఈ నెల 26వ తేదీన వచ్చిన తీర్పుకు లోబడి ఈ చర్యలకు ఉపక్రమించింది. ఇక ఫెమా చట్టంలోని 37ఏ సెక్షన్ ప్రకారం 2020 సెప్టెంబర్‌లో జప్తు చేసిన రూ. 89.19 కోట్ల మొత్తాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఆదేశాలు ఉన్నాయని, ఈ మొత్తాన్ని కూడా జరిమానాలో కలిపినట్టు ఈడీ పేర్కొంది. ఇదిలాఉంటే.. వ్యాపారవేత్త అయిన జగత్రక్షకన్ ప్రస్తుతం అరక్కోణం పార్లమెంట్ స్థానం నుంచి లోక్‌సభ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

## వైసీపీకి మరో ఎదురుదెబ్బ... పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి పోతుల సునీత రాజీనామా

- మొదటి పేజీ తరువాయి

చేరేది తెలియరాలేదు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ఆమె వెల్లడించారు. పోతుల సునీత వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉన్నారు. వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయడం ద్వారా ఆమె ఈ పదవికి కూడా రాజీనామా చేసినట్టయింది.

## తెలంగాణ బాగుండాలని రాజన్నను వేడుకున్నా

- మొదటి పేజీ తరువాయి

కార్తీక మాసంలో నిత్యాన్నదానం చేయాలని ఆలోచన చేస్తామని.. తిరుమల లాగా శాశ్వత అన్నదానం ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. సీఎంకు చిరకాల జ్ఞాపకం కోసం నేను, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి శాశ్వత అన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు. కోడెల రక్షణపై సీఎం ఆదేశాలతో గోశాల ఆధునీకరణ చేస్తున్నామని.. భక్తుల సౌకర్యాల కోసం వసతి గదుల నిర్మాణం చేస్తామని పేర్కొన్నారు.౹ తెలంగాణ మంచి వర్షాలతో బాగుండాలని రాజన్నను వేడుకున్నానని అన్నారు.

## కొప్పర్తి, ఓర్వకల్లులో భారీ పారిశ్రామిక హబ్ లు వస్తున్నాయి

- మొదటి పేజీ తరువాయి

రూ.12 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని, దీని ద్వారా 45 వేల మందికి ఉపాధి కలుగుతుందని అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఇక, కొప్పర్తి పారిశ్రామిక హబ్ ను 2,596 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. దీని కోసం రూ.2,137 కోట్ల వ్యయం చేయనున్నారని పేర్కొన్నారు. కొప్పర్తి పారిశ్రామిక హబ్ ద్వారా 54 వేల మందికి ఉపాధి కలుగుతుందని చెప్పారు.

## 10 రాష్ట్రాల్లో12 స్మార్ట్ సిటీలు.. తెలుగు రాష్ట్రాలకు 3 ప్రాజెక్టులు

**పెన్ పవర్ డెస్క్:** పర్యావరణ వ్యవస్థలో కేంద్రం మరో ముందడుగు..దేశవ్యాప్తంగా 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పారిశ్రామిక స్మార్ట్ సిటీలను నేషనల్ ఇండ స్ట్రి యల్ కారిడార్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ కింద నిర్మిస్తోంది. దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో ఈ స్మార్ట్ సిటీలను ఏర్పాటు చేయనున్నారు. 6 ప్రధాన కారిడార్ లతో పాటు వ్యూహాత్మకంగా నిర్మిస్తునాన్నారు. ఈ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం రూ. 28వలే 602 కోట్లు ఖర్చు చేస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డువలప్ మెంట్ ప్రోగ్రం కింద 12 స్మార్ట్ సిటీలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.

ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు ఉత్తరాఖండ్ లోని ఖుర్పియా, పంజాబ్ లోని రాజ్పురా పాటియాలా, మహారాష్ట్రలోని డిఘి, కేరళలోని పాలక్కాడ్ , యూపీలో ఆగ్రా, ప్రయాగ్ రాజ్, బీహార్ లోని గయా, తెలంగాణలో జహీరాబాద్, ఏపీలోని ఓర్వకల్, కొప్పర్తి, రాజస్థాన్ లోని జోధ్ పూర్ పాళిలో నిర్మించనున్నారు. ఈ పారిశ్రామిక హబ్ లలో రూ.1.5లక్షల కోట్ల పెట్టుబడి సామర్థ్యం, ప్రత్యక్షంగా 10 లక్షల మందికి, పరోక్షంగా 30 లక్షల మందికి ఉపాధి అవకాశాలు పొందనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు.

## వైసీపీలో జగన్ ను కంట్రోల్ చేసే సూపర్ పవర్ ఎవరో ఉన్నారు: డొక్కా మాణిక్య వరప్రసాద్

### ఎన్నికల ముందు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన డొక్కా

### వైసీపీలో రోజుకో టెస్ట్ తో పిచ్చెక్కించారని వెల్లడి

### వైసీపీలో జగన్ చెప్పినట్టు చేయాల్సిందేనని వ్యాఖ్యలు



ఎన్నికల ముందు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన సీనియర్ నేత డొక్కా మాణిక్య వరప్రసాద్ తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైసీపీలో జగన్ కంటే సూపర్ పవర్ ఇంకెవరో ఉన్నారని వెల్లడించారు. జగన్ ను కంట్రోల్ చేసే పవర్ మరేదో ఉందని అన్నారు.

వైసీపీలో రోజుకో టెస్ట్ తో పిచ్చెక్కించారని వ్యాఖ్యానించారు. తనకు జగన్ అపాయింట్ మెంట్ ఇవ్వలేదని, రోజుకో మాట చెప్పి ఫుట్ బాల్ ఆడారని డొక్కా వివరించారు. వైసీపీ పైనా, జగన్ పైనా తనకు ఎటువంటి కక్ష లేదని స్పష్టం చేశారు.

వైసీపీలో జగన్ చెప్పినట్టు చేయాల్సిందేనని... పదవులు, టికెట్లు రావాలంటే తిట్టాల్సిందేనని స్పష్టం చేశారు. నాతో కూడా దుర్మార్గంగా మాట్లాడించారని డొక్కా వాపోయారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే గతంలో వైసీపీలో చేరానని, కానీ వైసీపీ ఇచ్చిన టెస్టుల్లో ఫెయిలయ్యానని వెల్లడించారు. ఇటీవలి పరిణామాలు చూస్తుంటే, త్వరలో వైసీపీ ఖాళీ అయినా ఆశ్చర్యపోనవసరం లేదని అభిప్రాయపడ్డారు. జగన్ కు ఓటు బ్యాంకు ఉందని, అమాయక ఎస్సీ, ఎస్టీలను మందుపెట్టి దోచుకున్నారని విమర్శించారు.

## విషజ్వరాలు వణికిస్తుంటే కూటమి సర్కారుకి సూది గుచ్చినట్టయినా లేదు

### రాష్ట్రం జ్వరాంధ్రప్రదేశ్‌గా మారిందన్న ఏపీ పీసీసీ అధ్యక్షురాలు

### సమర్థవంతమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్

### పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు ముఖ్యమంత్రి నేరుగా పర్యవేక్షించాలని సూచించిన షర్మిల




రాష్ట్రాన్ని విష జ్వరాలు వణికిస్తుంటే కూటమి సర్కారుకి కనీసం సూది గుచ్చినట్టయినా లేదని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యాతో రాష్ట్రం జ్వరాంధ్రప్రదేశ్‌గా మారిందని, అయినా వైద్యారోగ్య శాఖ ఇంకా నిద్ర మత్తు వీడలేదని మండిపడ్డారు. పల్లెలు మంచం పట్టాయని, బాధితులతో ఆసుపత్రులు నిండిపోయాయని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులకు చికిత్స అందిస్తున్న దీనస్థితి ఉందన్నారు. ఓపీ ఫుల్... వైద్యం నిల్ అన్నట్లుగా రాష్ట్రంలో సర్కారు వైద్యం పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారుఏ గ్రామం చూసినా, ఏ వార్డు చూసినా జ్వరాలతో జనాలు మంచం పట్టిన దృశ్యాలు కనిపిస్తున్నాయని వైఎస్ షర్మిల పేర్కొన్నారు.

“రోజురోజుకీ పరిస్థితి విషమిస్తుంటే కమిటీల పేరుతో ఆరోగ్య శాఖ మంత్రి కాలయాపన చేస్తున్నారు తప్పితే నియంత్రణకు చర్యలు మాత్రం లేవు. గత సర్కారును తిడుతూ ఐదేళ్లు కాలయాపన చేసేస్తారా? వర్షాకాలం కాబట్టి జ్వర తీవ్రత ఉంటుంది. అటు పారిశుధ్యం, ఇటు ఆసుపత్రుల్లో సదుపాయాలు చూసుకోవాలని ప్రత్యేకంగా చెప్పాలా?” అని ఆమె ప్రశ్నించారు.

**ముఖ్యమంత్రి నేరుగా పర్యవేక్షించాలి**

అన్ని శాఖలతో కూడిన సమర్థవంతమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా పర్యవేక్షించాలని ప్రభుత్వానికి వైఎస్ షర్మిల సూచించారు. జ్వరాల పీడ నుంచి రాష్ట్ర ప్రజలను రక్షించాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు. “మన్యంలో ఇంటికొకరు మంచాన పడితే.. జ్వరాలను అరికట్టడంపై ఇంతవరకు కార్యాచరణ లేకపోవడం ఈ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ తలపిస్తుంది. విష జ్వరాల కాటుకు ప్రజలు బలి కాకముందే కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించాలి. తక్షణం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి మందుల కొరత లేకుండా చూడాలి. గ్రామీణ, పట్టణ, ఏజెన్సీ ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు వెంటనే చేపట్టాలి” అని షర్మిల డిమాండ్ చేశారు.

# 66 ఫీట్ల ఫిరంగి నాలా కబ్జా..జన్వాడ ఫామ్ హౌస్ సర్వేలో సంచలనం



జన్వాడ ఫామ్‌హౌస్ దగ్గర మరోసారి సర్వే చేస్తున్నారు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు. ఆరుగురు అధికారుల బృందం సర్వే చేస్తుంది. రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలంలోని ఫిరంగి నాలాను భారీ బందోబస్తు మధ్య సర్వే చేస్తున్నారు. శంకర్ పల్లి మండలం బుల్కా పూర్ గ్రామం నుంచి మొదలైన ఈ ఫిరంగి నాలా జన్వాడ గ్రామ రెవెన్యూలోని కేటీఆర్ ఫామ్ హౌస్ ముందు నుంచి వెళ్తుంది. ఈ ఫిరంగి నాలా పరిధిలోనే కేటీఆర్ ఫామ్ హౌస్ ఉన్నట్లు ఆరోపణలు రావడంతో ఈ సర్వే ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నాలా సుమారు 66 ఫీట్లు ఉండేదని స్థానిక రైతులు చెబుతున్నారు. ఇది ఎంత వరకు కబ్జాకు గురైంది.? బఫర్ జోన్ ఎంత వరకు ఉందనే సమాచారాన్ని సేకరిస్తున్నారు అధికారులు.

ఇటీవలే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు జన్వాడ ఫామ్ హౌస్ ను పరిశీలించి కొలతలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే జన్వాడ ఫాంహౌస్ ను కూల్చొద్దంటూ హైకోర్టుకు వెళ్లారు బీఆర్ఎస్ నేత, కేటీఆర్ సన్నిహితుడు ప్రదీప్ రెడ్డి. ఐతే సిటీలో చెరువుల కబ్జా, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రూల్స్ ప్రకారమే వెళ్లాలని ప్రభుత్వానికి సూచించింది హైకోర్టు.రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడ గ్రామం సర్వే నంబర్ 311 (311/7)లో 1,210 చదరపు గజాల్లోని 3,894 చదరపు అడుగులతో నిర్మించిన ఫామ్ హౌస్ ఎఫ్ టీఎల్, బఫర్ జోన్ లో నిర్మించారని గత కొన్ని రోజులుగా ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఈ ఫామ్ హౌస్ తనది కాదన్నారు. తన ఫ్రెండ్ ఫామ్ హౌజ్ ను లీజుకు తీసుకున్నానని చెప్పారు.

# ఇలాంటి ఊసరవెల్లి నేతలను పార్టీలోకి తీసుకోవద్దు... టీడీపీ హైకమాండ్ కు గౌతు శిరీష విజ్ఞప్తి

**వైసీపీకి, ఎమ్మెల్సీ పదవికి పోతుల సునీత రాజీనామా**

**ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తానని వెల్లడి**

**ఈ నేపథ్యంలో, చర్చనీయాంశంగా మారిన గౌతు శిరీష ట్వీట్**



వైసీపీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి పోతుల సునీత రాజీనామా చేయడం తెలిసిందే. పోతుల సునీత ఏ పార్టీలో చేరేది ఇంకా ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో, టీడీపీ ఎమ్మెల్యే గౌతు శిరీష చేసిన ట్వీట్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. "టీడీపీ పార్టీ పెద్దలకు మనవి. దయచేసి ఇలాంటి ఊసరవెల్లి నాయకులను మన పార్టీలోకి తీసుకోవద్దు. అధికారం కోసం వచ్చే ఇలాంటి వాళ్లని పార్టీలోకి తీసుకుంటే, అధికారం లేనప్పుడు మన పార్టీ కోసం నిజాయతీగా పోరాడిన వాళ్లను అవమానించినట్టే" అంటూ గౌతు శిరీష ట్వీట్ చేశారు. పోతుల సునీత రాజీనామా వార్త క్లిప్పింగ్ ను కూడా శిరీష పంచుకున్నారు.

# ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న కవిత... ఘనస్వాగతం పలికిన బీఆర్ఎస్



ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బెయిల్ పై విడుదలైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ సాయంత్రం ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చిన ఆమెకు బీఆర్ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. కవిత వెంట ఆమె భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, హరీశ్ రావు, జోగినపల్లి సంతోష్ కుమార్, ఇతర కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు ఉన్నారు. కవిత ఎంతో ఉత్సాహంగా ఎయిర్ పోర్టు నుంచి వెలుపలికి వచ్చారు. దాదాపు ఐదున్నర నెలల తర్వాత కవిత హైదరాబాద్ లో అడుగుపెట్టడంతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగుతోంది. కాగా, కవిత హైదరాబాద్ నుంచి కేసీఆర్ ఫాంహౌస్ కు వెళతారని తెలుస్తోంది.

# కోల్‌కతా హత్యాచార ఘటన... నిందితుడి తరఫున వాదిస్తోంది ఎవరో తెలుసా?

- దేశవ్యాప్తంగా కలకలం సృష్టించిన కోల్‌కతా హత్యాచార ఘటన
- ప్రస్తుతం ఈ ఘటనపై సీబీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు
- నిందితుడు సంజయ్ రాయ్ తరఫున వాదించేందుకు ముందుకు రాని లాయర్లు
- కేసులో పారదర్శకత కోసం లీగల్ ఎయిడ్‌కు కోర్టు సిఫార్సు దాంతో నిందితుడి తరఫున వాదించే బాధ్యతలు కవితా సర్కార్‌కు అప్పగింత



కోల్‌కతా జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన యావత్ దేశాన్ని కలిచివేసింది. దీంతో బాధితురాలికి మద్దతుగా దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం ఈ ఘటనపై సీబీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోంది. అయితే, నిందితుడు సంజయ్ రాయ్ తరఫున న్యాయస్థానంలో వాదనలు వినిపించేందుకు ఏ న్యాయవాది ముందుకు రాలేదు. కానీ పారదర్శక విచారణ కోసం నిందితుడి వాదనలు వినడం కూడా కేసులో ముఖ్యమని భావించిన కోర్టు లీగల్ ఎయిడ్‌కు సిఫార్సు చేసింది. ఇందులో భాగంగా నిందితుడు తరఫున వాదించే బాధ్యతలను కోల్‌కతాకు చెందిన మహిళా న్యాయవాది కవితా సర్కార్‌కు అప్పగించడం జరిగింది. దీంతో ఆమె పేరు ఇప్పుడు ఒక్కసారిగా వార్తల్లో మార్మోగిపోతోంది.

# సీసీ కెమెరాలో దెయ్యం కనిపించింది.. ఊరంతా ఒకటే భయం




సీసీ కెమెరాలో దెయ్యం కనిపించిందంట.. అది కూడా నల్లగా.. సినిమాలో చూపించినట్లు కనిపించిందంట.. ఈ మాత్రం చాలు పల్లెల్లో భయం పుట్టించటానికి.. ఇప్పుడు ఇలాంటి ఘటనే ఖమ్మం జిల్లా వైఎస్ఆర్ నగర్ లో హల్ చల్ చేస్తుంది. కాలనీలోని ఓ ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో దెయ్యం కనిపించిందంటు మొదలైన ప్రచారం.. కాలనీ మొత్తాన్ని భయంలోకి నెట్టింది. సీసీ కెమెరాలో రికార్డయిన సదరు దెయ్యం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వటంతో ఊరు మొత్తం దెయ్యం భయంతో వణికిపోతోంది.

సైన్స్ ఇంతగా అభివృద్ధి చెంది, ఏలియన్స్ తో సైతం కమ్యూనికేట్ అవ్వడానికి ప్రయత్నిస్తున్న ఈ రోజుల్లో కూడా దెయ్యం భయం ఏంటని కొందరు నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు. అసలు అది దెయ్యమే కాదని, మనిషి నీడలా ఉందని, లైటింగ్ లో అలా వింత ఆకారంలా కనిపించి ఉంటుందని ఇంకొంతమంది నెటిజన్స్ కామెంట్ చేస్తున్నారు.

%ూశ్రీంశీ ఖు౦% :- యూట్యూబ్ వీడియోలు, రీల్స్ చేస్తే రూ. 8 లక్షలు.. ఎక్కడంటే ?

ఏది ఏమైనా ఒక చిన్న వీడియో ఊరు మొత్తాన్ని దెయ్యం భయంతో వణికేలా చేసిందని చెప్పాలి. అరచేతిలో ప్రపంచాన్ని చూడగలుగుతున్ననేటిరోజుల్లో కూడా మనిషిని దెయ్యం భయం వీడకపోవటం ఒకింత హాస్యాస్పదమని చెప్పాలి. ఇంకా నయం ఇటీవల ఎక్కడో లైటింగ్ కి ఏర్పడ్డ నీడను ఏలియన్ అంటూ ప్రచారం చేసినట్లు ఈ వీడియోను కూడా ఏలియన్ అని ప్రచారం చేయలేదు.

# రూ. 70వేల కోట్ల విలువ.. రిలయన్స్-డిస్నీ విలీనానికి గ్రీన్ సిగ్నల్




భారత దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్, వాల్ట్ డిస్నీ వ్యాపార విలీనానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. విలీనానికి సంబంధించి ఈ ఇరు కంపెనీలు ఆరు నెలల క్రితమే ప్రకటన చేయగా..

తాజాగా సీసీఐ ఆమోదం ముద్ర వేసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, వయాకామ్ 18 ప్రైవేట్ లిమిటెడ్, డిజిటల్ 18 మీడియా లిమిటెడ్, స్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, స్టార్ టెలివిజన్ ప్రొడక్షన్స్ లిమిటెడ్‌లతో కూడిన ప్రతిపాదిత కలయికను కమిషన్ ఆమోదించింది. స్వచ్ఛంద సవరణలకు లోబడి ఈ ఒప్పందం ఉంటుంది అని సీసీఐ సోషల్ మీడియా వేదికగాప్రకటించింది. అయితే ఆ సవరణలు ఏంటి అనేది మాత్రం సీసీఐ వెల్లడించకపోవడం గమనార్హం.

**రూ. 70,350 కోట్ల విలువ**

ఈ ఏడాది ఆరంభంలో రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన వయాకామ్, వాల్ట్ డిస్నీ కంపెనీ స్టార్ ఇండియాల మధ్య 8.5 బిలియన్ డాలర్ల(భారత కరెన్సీలో సుమారు సుమారు రూ. 70,350 కోట్ల)కు విలీన ఒప్పందం జరిగింది. ఈ విలీనం పూర్తైతే 120 టెలివిజన్ ఛానెళ్లు, రెండు స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లతో కూడిన అంబానీ సంస్థ అతిపెద్ద మీడియా సంస్థగా అవతరించనుంది. విలీన సంస్థలో %=×ూ% 16.34 శాతం, వయాకామ్ 18 46.82 శాతం, డిస్నీ 36.84 శాతం వాటా కలిగి ఉండనున్నాయి.

**చైర్‌పర్సన్‌గా నీతా అంబానీ**

ఈ మీడియా వెంచర్‌కు వాల్ట్ డిస్నీ మాజీ ఎగ్జిక్యూటివ్ ఉదయ్ శంకర్ వైస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించనుండగా.. ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ చైర్‌పర్సన్ పాత్రను పోషిస్తారు. కొత్త బోర్డులో 10 మంది సభ్యులు ఉంటారు. % ఐదుగురిని, డిస్నీ ముగ్గురు, ఇద్దరు స్వతంత్ర డైరెక్టర్లను నామినేట్ చేస్తుంది. 2024 చివరి త్రైమాసికంలో లేదా 2025 మొదటి త్రైమాసికంలో విలీనం పూర్తవుతుందని భావిస్తున్నారు.

# ఉపాధికోసం గల్ఫ్‌కు వెళ్లిన మహిళ.. తిరిగొస్తూ.. ఇంటికి చేరేలోపే గుండెపోటుతో..



ఉపాధికోసం గల్ఫ్ బాట పట్టింది ఆ మహిళ..దేశం కానీ దేశం వెళ్లి అష్టకష్టాలు పడుతూ దొరికిన పని చేస్తూ గత కొన్నేళ్లుగా కుటుంబాన్ని ఆదుకుంది.. కష్టం బాధించినా.. ఇద్దరు బిడ్డల భవిష్యత్ ఆమె కళ్లముందు కనబడింది.. తప్పా.. ఆమె ఆరోగ్యం గురించి పట్టించుకోలేదు.. ఆనారోగ్యం బారిన పడింది..నా అన్నవాళ్లు ఎవరూ లేక..బతికుంటే..సొంతూళ్లోనే పనిచేసుకుని పిల్లల్ని పోషించు కుందాం అనుకుంది.. స్వదేశం బయల్దేరింది.. కానీ విధి వంచించింది.. ఇంకో కొన్ని గంటల్లో ఇంటికి చేరే లోపే.. ఆమె ఆశల దీపం ఆరిపోయింది. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన తూర్పుగోదావరి జిల్లా కోరుమామిడి గ్రామానికి చెందిన సత్య పద్మ.. తిరిగి ఇంటికి చేరే క్రమంలో గుండెపోటుతో ప్రాణాలొదిలిన ఘటన మంగళవారం (ఆగస్టు 27) న జరి గింది. గల్ఫ్ నుంచి విమానంలో హైదరాబాద్ కు చేరుకున్న సత్యపద్మ తన సొంతూరుకు చేరేక్రమంలో బస్సులో వెళ్లతూ గుండెపోటుకు గురై చనిపోయిన విజువల్స్.. సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సత్యపద్మ విషాద గాధను నెటిజన్లు కన్నీళ్లు పెడుతున్నారు.

పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన ప్రభాకర్‌తో 15 ఏళ్ల క్రితం సత్యపద్మకు పెళ్లిజరిగింది. వారికి ఇద్దరు పిల్లలు.ప్రభాకర్‌కు వచ్చే కొద్దిపాటి ఆదాయం సరిపోకపోవడంతో సత్య పద్మ విదేశాల్లో ఉద్యోగం చేయాలని నిర్ణయించుకుంది.విజయవాడలోని ఓ కన్సల్టెంట్ ద్వారా సత్య పద్మ ఉద్యోగ నిమిత్తం మస్కట్ వెళ్లింది. అయితే తన జాబ్ ప్రొఫైల్‌కు సరిపోయే పని దొరక్క సత్య పద్మ తనకు దొరికిన దానిలో స్థిరపడింది.చాలా ఏళ్లుగా మస్కట్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని ఆదుకుంది.కానీ విపరీతమైన పని ఒత్తిడి ఆమెను బాగా పెంచింది. ఆమె ఆరోగ్యం క్షీణించింది. ఎట్టకేలకు భారత్‌కు తిరిగి రావాలని నిర్ణయిం చు కుని తన ఏజెంట్‌తో చెప్పింది. కష్టాలు ఒకదాని వెంట ఒకటి చుట్టుముట్టి అనుకోని మరణం ఆమెను వెంటాడింది.. సత్య పద్మ మస్కట్ నుంచి స్వదేశానికి వస్తుండగా మృతి చెందింది. కుటుంబ పోషణే లక్ష్యంగా బతికిన సత్య పద్మ ఆకస్మికంగా మరణించిన తీరు పలువురిని కలిచివేసింది. సత్య పద్మ కథ కేవలం వ్యక్తిగత విషాదం మాత్రమే కాదు.. మెరుగైన జీవితాన్ని వెతుక్కుంటూ ఇంటిని విడిచివెళ్లే అనేకమంది ఎదుర్కొంటున్న కఠినమైన వాస్తవాలకు ప్రతిబింబం.వారి కుటుంబాల కు మెరుగైన జీవితాన్ని అందించడానికి గల్ఫ్ వలసదారులు ఏమి చేయాల్సి ఉంటుందో గుర్తుచేస్తున్న ఘటన.

# అల్లు అర్జున్ హీరో కాదు.. కమెడియన్: జనసేన ఇంచార్జి రమేష్ బాబు



అల్లు వారసుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై జనసేన నేతలు విరుచుకుపడుతున్నారు. ఒకరివెంట మరొకరు మీడియా ముందుకొచ్చి మాటలు తుళ్లుతున్నారు. అల్లు అర్జున్‌కి అసలు అభిమానులే లేరని, ఉన్నట్లు ఊహలో బతుకుతన్నారని జనసేన బొలిశెట్టి శ్రీనివాస్ ఎద్దేవ చేయగా.. తాజాగా గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమల శెట్టి రమేష్ బాబు ఒకడుగు ముందుకేసి అల్లు అర్జున్ అసలు హీరోనే కాదని, ఒక కమెడియన్ అని వ్యాఖ్యానించాడు. అల్లు అర్జున్‌ని విమర్శించడానికే మీడియా సమావేశం ఏర్పాటుచేసిన గన్నవరం నియోజకవర్గ ఇంచార్జి రమేష్ బాబు నోటికొచ్చినట్లు మాట్లాడారు. అల్లు అర్జున్ నువ్వు హీరో అనుకుంటున్నావా? కమెడియన్ మాత్రమే. చిరంజీవి, పవన్ కళ్యాణ్, నాగబాబు అండ చూసుకుని నీవు సినిమాల్లోకి వచ్చావు. వారిని విమర్శించే స్థాయి నీకు లేదు అంటూ విరుచుకు పడ్డారు.

**చిరంజీవి మహావృక్షం**

"చిరంజీవి అనే వ్యక్తి సినీ ఇండస్ట్రీలో మహావృక్షం లాంటివాడు. ఎన్నో సంఘ సేవలు, బ్లడ్ బ్యాంక్ నిర్వహణల ద్వారా ఎంతోమందికి జీవితాన్ని ప్రసాదించిన మహనీయుడు. నువ్వు నీడ నిచ్చిన చెట్టునే విమర్శిస్తున్నావు. నీవు, నీ బాబు అల్లు అరవింద్ ఎవరికీ ఉపకారం చేయనివారు. ఏనాడూ పిల్లికి కూడా బిక్షం పెట్టనివారు. మీ స్థాయి ఏమిటో, నువ్వేమిటో ముందు చూసుకో. నువ్వు తొందరలో చిరంజీవి, పవన్ కళ్యాణ్, నాగబాబు కాళ్లు కడిగి నీళ్లు నెత్తిన చల్లుకుంటే కానీ నువ్వు చేసిన తప్పు సరికాదు.." అని చలమల శెట్టి రమేష్ బాబు మాట్లాడారు.

**నీ సినిమా ఎలా ఆడుతుందో చూస్తా..!**

అంతేకాదు, ఈ ఏడాది డిసెంబర్ నెలలో విడుదల కానున్న పుష్ప సీక్వెల్ పుష్ప–2 సినిమా గన్నవరం నియోజకవర్గంలో ఎలా ఆడుతుందో చూస్తానని రమేష్ బాబు హెచ్చరించాడు. అల్లు అర్జున్ సినిమాలకు ఫ్లెక్సీలు కట్టే వాళ్ళు కూడా తమ నియోజక వర్గంలో ఎవరూ లేరని ఆయన వ్యాఖ్యానించాడు.

# విద్యుత్ షాక్‌తో చిరుత మృతి.. మూడో కంటికి తెలియకుండా పూడ్చిపెట్టిన రైతు



అడవి పందుల నుండి పంట పొలాన్ని రక్షించుకునేందుకు ఓ రైతు పొలం చుట్టూ కరెంట్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. అయితే, కరెంట్ ఫెన్సింగ్‌కు తగిలి ఓ చిరుత మరణించింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని హాజీపూర్ కట్టకింది తండాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యుత్ షాక్ గురై మరణించిన చిరుత పులిని రైతు గుట్టు చప్పుడు కాకుండా పూడ్చిపెట్టాడు. మరోవైపు చిరుత జాడ కనిపించక రెండు రోజులుగా ఫారెస్ట్ అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చిరుత మరణించిన సమాచారాన్ని ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాడు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు చిరుత పూడ్చిపెట్టిన చోటుకు చిరుకుని చిరుత మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## అంతర్జాతీయ క్రికెట్‌కు ఇంగ్లండ్ ఓపెనర్ గుడ్ బై



ఇంగ్లండ్ ఓపెనర్, పంజాబ్ కింగ్స్ మాజీ బ్యాటర్ డేవిడ్ మలన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. గతేడాది భారత్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్‌లో చివరిసారిగా బరిలోకి దిగిన 37 ఏళ్ల ఈ ఓపెనర్.. ఆ తర్వాత మళ్లీ ఇంగ్లండ్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. ఈ క్రమంలోనే అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు.

ఇంగ్లీష్ జట్టు తరుపున 2017లో అంతర్జాతీయ అరంగ్రేటం చేసిన మలన్.. 22 టెస్టులు, 30 వన్డేలు, 62 టీ20లు ఆడాడు. టెస్టుల్లో 1074, వన్డేల్లో 1450, టీ20ల్లో 1892 పరుగులు చేశాడు. నిలకడగా ఆడటంతో సమర్థుడు. అతన్ని ఔట్ చేయాలంటే బౌలర్లు శక్తికి మించి శ్రమించాల్సిందే. టీ20ల్లో ఈ ఇంగ్లీష్ ఓపెనర్‌కు మంచి రికార్డ్ ఉంది. పొట్టి ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 1,000 పరుగులు చేసిన బ్యాటర్.. ఈ క్రికెటరే. 24 ఇన్నింగ్స్‌ల్లోనే వెయ్యి పరుగులు మార్కును చేరుకున్నాడు. 2020 సెప్టెంబరులో టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచాడు.

**సఫారీలకు చుక్కలు**

కార్డిఫ్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన తన అరంగేట్ర మ్యాచ్‌లో మలన్ సఫారీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. 12 ఫోర్లు, 2 సిక్సుల సాయంతో 44 బంతుల్లోనే 78 పరుగులు సాధించాడు. అదే ఏడాదిఆస్ట్రేలియాతో జరిగిన యాషెస్ సిరీస్‌లో మెరుపు శతకం బాదాడు. అతని కెరీర్‌లో ఇలాంటి మరుపురాని ఇన్నింగ్స్‌లు ఎన్నో ఉన్నాయి. ఇంగ్లండ్ తరుపున మూడు ఫార్మాట్లలోనూ శతకాలు బాదిన ఇంగ్లీష్ రెండో బ్యాటర్ మలన్. ఈ ఓపెనర్ ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ తరుపున ఆడాడు. 2021 సీజన్‌లో ఒకే ఒక మ్యాచ్ ఆడి 26 పరుగులు చేశాడు.

**రిటైర్మెంట్‌కు కారణం అదేనా..!**

సెప్టెంబర్ 11 నుంచి ఆస్ట్రేలియాతో ప్రారంభం కానున్న టీ20, వన్డే సిరీస్‌ల కోసం ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ఇటీవలే తమ జట్టును ప్రకటించింది. ఆ జట్టులో మలన్‌కు చోటు దక్కలేదు. ఈ క్రమంలోనే అతను రిటైర్మెంట్ ప్రకటించాడని వార్తలు వస్తున్నాయి. ఇంగ్లండ్ టీ20 జట్టు: జోస్ బట్లర్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్సే, జోర్డాన్ కాక్స్, సామ్ కర్రాన్, జోష్ హల్, విల్ జాక్స్, లియామ్ లివింగ్‌స్టోన్, సాకిబ్ మహమూద్, డాన్ మౌస్లీ, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, రీస్ టోప్లీ, టర్నర్.

ఇంగ్లండ్ వన్డే జట్టు: జోస్ బట్లర్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్సే, బెన్ డకెట్, జోష్ హల్, విల్ జాక్స్, మాథ్యూ పాట్స్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, జామీ స్మిత్, రీస్ టోప్లీ, టర్నర్.

## పూరన్, హెట్మెయర్ సిక్సుల వర్షం.. సౌతాఫ్రికాపై సిరీస్ క్లీన్ స్వీప్

సౌతాఫ్రికాతో జరిగిన మూడు మ్యాచుల టీ20 సిరీస్‌ను అతిథ్య వెస్టిండీస్ జట్టు క్లీన్ స్వీప్ చేసింది. మంగళవారం రాత్రి ట్రినిడాడ్‌లోని బ్రియాన్ లారా క్రికెట్ స్టేడియంలో జరిగిన నామా మాత్రపు మూడో టీ20లో వెస్టిండీస్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 13 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేయగా.. ఈ సమయంలో వర్షం పడింది. దీంతో అఫిషియల్స్ మ్యాచ్‌ను కాసేపు నిలిపారు. వర్షం తగ్గుముఖం పట్టిన అనంతరం మ్యాచ్ సమయాన్ని కుదించి డీఎల్ఎస్ (డక్ వర్త్ లూయిస్) మెథడ్‌లో వెస్టిండీస్‌కు 13 ఓవర్లలో 116 పరుగుల టార్గెట్‌ను విధించారు. సౌతాఫ్రికా బ్యాటర్లలో రికెల్టన్ (27), మార్క్రమ్ (20), ట్రిస్టన్ స్టబ్స్ (40) పరుగులు చేశారు. ఫెఫర్డ్ 2 వికెట్లు పడగొట్టగా.. హెూస్సేన్, ఫోర్డ్ చెరో వికెట్ సాధించారు. అనంతరం 13 ఓవర్లలో 116 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్.. మరో 22 బంతులు ఉండగానే మ్యాచ్‌ను ముగిచింది. ఈ సిరీస్‌లో ఫుల్ ఫామ్‌లో ఉన్న కరేబియన్ బ్యాటర్స్.. 116 పరుగుల లక్ష్యాన్ని కేవలం 9.2 ఓవర్లలోనే ఛేజ్ చేసి సునాయస విజయం సాధించారు. ముఖ్యంగా వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ నికోలస్ పూరన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 13 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లు బాది 35 పరుగులు చేశాడు. అనంతరం షాయ్ హెూప్ (42), షిమ్రోన్ హెట్‌మైర్ (31) అజేయంగా నిలిచి మ్యాచ్‌ను ఫినిష్ చేశారు. తద్వారా మూడు మ్యాచుల సిరీస్ ను అతిథ్య వెస్టిండీస్ క్లీన్ స్వీప్ చేసింది.



## వారం రోజులుగా ICUలో చికిత్స.. తుది శ్వాస విడిచిన ఫుట్‌బాలర్




గత వారం రోజులుగా ఆస్పత్రి బెడ్‌పై కొన ఊపిరితో కొట్టుమిట్టాడిన ఉరుగ్వే ఫుట్‌బాల్ ప్లేయర్ జువాన్ ఇజ్కియర్డో(27) తుది శ్వాస విడిచారు. మరణాన్ని అతను ప్రాతినిథ్యం వహిస్తున్న ఉరుగ్వే క్లబ్ నేషనల్ ధ్రువీకరిచింది. ఇజ్కియర్డో మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన యాజమాన్యం.. అతని లేని జట్టును ఊహించుకోలేకపోతున్నామని ప్రకటన చేసింది. ఆగష్టు 23న సావో పాలోతో జరిగిన మ్యాచ్‌లో క్లబ్ నేషనల్ డిఫెండర్ జువాన్ ఇజ్కియర్డో అకస్మాత్తుగా మైదానంలో కింద పడిపోయాడు. ఆట 84వ నిమిషంలో అతను ఎవరి ప్రమేయం లేకుండానే నిల్చున్న చోటనే కుప్పకూలాడు. వెంటనే స్పందించిన సిబ్బంది హుటాహుటీన ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుండి ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ఎంత ప్రయత్నించినప్పటికీ అతన్ని కాపాడలేకపోయారు. మంగళవారం అతను తుది శ్వాస విడిచారు."ప్రియమైన ఆటగాడు జువాన్ ఇజ్కియర్డో మరణం మాకు తీరని లోటు. అతను లేని ప్రపంచం బోసిపోయినట్లుగా ఉంది. అతని కుటుంబం, స్నేహితులు, సహెూద్యోగులు, ప్రియమైన వారికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం.." అని క్లబ్ నేషనల్ సోషల్ మీడియా హ్యాండిల్ లో పోస్ట్ చేసింది.



షార్వరి యొక్క అద్భుతమైన ఫ్యాషన్ చిత్రాలు

## ట్యాగ్ కాదు.. బాధ్యత : త్రిప్తి డిమ్రి

%యానిమల్ సినిమాతో ఓవర్ నైట్ క్రేజీ హీరోయిన్‌గా మారిన త్రిప్తి డిమ్రి.. 'బ్యాడ్ న్యూజ్' సినిమాతో గత శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇందులో విక్కీ కౌశల్‌తో త్రిప్తి చేసిన రొమాంటిక్ సాంగ్ కారణంగా.. ఓపెనింగ్స్ బాగున్నప్పటికీ, సినిమాకు మాత్రం మిక్సుడ్ రెస్పాన్స్ వచ్చింది. ఇక 'యానిమల్'తో నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకున్న త్రిప్తి.. అలా పిలవడం గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పందించింది. ఆ ట్యాగ్ విషయంలో తాను ఎంతో సంతోషంగా ఉన్నానని చెప్పింది. అయితే దాన్నొక ట్యాగ్‌గా మాత్రమే కాకుండా.. అభిమానుల ప్రేమగా చూస్తున్నానని, అది ఓ నటిగా తనపై మరింత బాధ్యతను పెంచిందని చెప్పిందామె.



ఇక కెరీర్ ప్రారంభించి ఏడేళ్లు పూర్తవడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేసింది. గొప్ప నటీనటులు, దర్శకులతో పనిచేసే అవకాశం వస్తుందని అప్పట్లో తాను ఊహించలేదని చెప్పింది. "ఫస్ట్ మూవీ తర్వాత అదృష్టం ఉంటే రెండో సినిమా ఛాన్స్ రావొచ్చు అనుకున్నానే తప్ప యాక్టింగ్‌ను సీరియస్‌గా తీసుకోలేదు. అలాంటి టైమ్‌లో 'లైలా మజ్ను' ఆడిషన్‌లో పాల్గొన్నా. ఆ తర్వాతే యాక్టింగ్‌పై ఫోకస్ పెట్టా. నటనలో శిక్షణ తీసుకున్నా. దాంతో ప్రేక్షకులు కూడా నా నటనతో కనెక్ట్ అవుతున్నారు" అని త్రిప్తి డిమ్రి చెప్పింది.



రష్మిక మందన్న యొక్క అందమైన మ్యాగజైన్ ఫోటోలు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com